

30న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కెఎల్.రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పలు సంస్థల్లో పని చేసేందుకు ఎస్-ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బి.టెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సింటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 7799376333 నెంబరులో, www.vikasajobs.comలో సంప్రదించాలని తెలిపారు.

వేతనం పెంచేదెపుడు జగనన్నా..?

- అతి తక్కువ వేతనాలతో మిడ్డే మీల్స్ కార్మికుల అవస్థలు
- పెంచుతామన్న సర్కారు హామీ దాటవేత
- రూ.10 వేలు కోరుతున్న వర్కర్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అతి కొద్ది వేతనంతో కుటుంబాలను పోషించుకోలేక మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండి వడ్డిస్తున్నప్పటికీ ఏళ్ల తరబడి కనీస వేతనాలు అందడం లేదు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మిడ్డే మీల్స్ వర్కర్ల సమస్యల పట్ల చంద్రబాబు తీరును తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు అదే రీతిన వ్యవహరిస్తున్నారు. కేవలం రూ.3 వేల వేతనంతో కాలం వెళ్ళదీస్తున్న వీరంతా కుటుంబాలను పోషించుకోవడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కాకినాడ జిల్లాలో 1,250 పాఠశాలల్లో 1,46,849 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ప్రైమరీ విద్యార్థులు 42960 మంది, యుపి విద్యార్థులు 12,403, హైస్కూలు విద్యార్థులు 91,486 మంది ఉన్నారు. వీరిలో 1,03,138 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 3,500 మంది కార్మికులున్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం, వారిని ఆకలి బాధ నుంచి దూరం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్యను పెంచే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వీరంతా సమర్థవంతంగా అమలు జరిగేలా కృషి చేస్తున్నారు.



మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికురాలు

హామీ అమలేది..?

ఎన్నికలకు ముందు వైఎస్.జగన్ నిర్వహించిన పాదయాత్రలో మధ్యాహ్న భోజన పథక కార్మికులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు దాటుతున్నా నేటికీ హామీ అమలు జరగలేదు. రూ.వెయ్యి మాత్రమే ఉన్న వేతనాన్ని రూ.3 వేలకు పెంచినా.. అదీ అనేకమంది కార్మికులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. తొండంగి మండలం బెండపూడి కేంద్రంగా అల్లూరి సీతారామరాజు ఎడ్యుకేషన్ ట్రస్ట్ పని చేస్తోంది. కత్తిపూడి, చిత్రాడ క్లస్టర్ల పరిధిలో తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, గొల్లప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాలున్నాయి. వీటి పరిధిలో పని చేస్తున్న సుమారు 2 వేల మంది వర్కర్లకు కేవలం రూ.1500 మాత్రమే వేతనంగా అందజేస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేలు ఇవ్వాల్సి ఉన్నా ఏజెన్సీలు ఉన్నచోట సగం జీతం మాత్రమే వస్తుండడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లో రూ.3000 గౌరవ వేతనం అందిస్తున్నా ఇక్కడ మాత్రం ఇవ్వకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు ధర్నాలు చేసి అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడంలేదని మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. వాస్తవానికి స్కీము వర్కర్లకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని చట్టం చెబుతున్నా ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకుంటూ అరకొర జీతాలే ఇస్తోంది. ఇప్పటికైనా స్పందించి కనీసంగానైనా రూ.10 వేలు ఇచ్చి జగన్ ఇచ్చిన హామీను నిలబెట్టుకోవాలని కార్మికులంతా కోరుతున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం వంట పాత్రలు ఇచ్చి చేతులు దులుపుకున్న సర్కారు ఆ తర్వాత నుంచి ఇవ్వడం మానేసింది.కార్మికులే సొంతంగా కొనుగోలు చేసుకుని వండి వడ్డిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే వంట పాత్రలు కూడా ఇవ్వాలని, గ్యాస్ సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. పిల్లలకు రూ.20 వరకూ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



గౌవర వేతనం సరిపోవడం లేదు

ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పిల్లలకు భోజనం వండి వడ్డిస్తున్న తమకు ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేలు గౌరవ వేతనం ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రస్తుతం నిత్యవసరాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. వాటికి అనుగుణంగా కుటుంబాన్ని పోషించుకోవాలంటే కష్టంగా మారింది. మెనూ ఛార్జీలు కూడా సరిపోవడం లేదు. వంట పాత్రలను మేమే కొనుగోలు చేసుకుంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వేతనం ఇచ్చి ఆదుకోవాలి.

- కె.సుబ్బలక్ష్మి, ఎలిమెంటరీ స్కూల్, పెద్దాపురం.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర సాయం

ప్రజాశక్తి-కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల్లో బాధిత కుటుంబాలకు సత్వరం సహాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరైన ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి డి.వి.రమణమూర్తి గత సమావేశంలో చర్చించిన అంశాలపై కార్యాచరణను వివరించారు. అనంతరం జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి విచారణలో పురోగతి, బాధితులకు పరిహారం పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు సత్వరం న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్టు తెలిపారు. త్వరితగతిన విచారణ పూర్తిచేసి ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు చూస్తే ప్రస్తుతం 19 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్నాయన్నారు. కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విచారణను వీలైనంత త్వరగా పూర్తిచేసి ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తున్నట్లు వివరించారు. దశల వారీగా బాధిత కుటుంబాలకు అందాల్సిన పరిహారం విషయంలో సమన్వయ శాఖల అధికారులతో కలిసి కషిచేస్తున్నట్లు ఎస్‌పి సతీష్ కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, బండి వీరలింగేశ్వరరావు, గంగవంశం త్రినాథ్‌దేవ్, పిల్లి జ్యోతి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కాకినాడ

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యా సంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, ప్రేమ్ కాజల్, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, ఔషధ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ, రవాణా తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలుత సెబ్ ఎఎస్‌పి ప్రేమ్ కాజల్ జిల్లాలో నమోదు చేసిన గంజాయి కేసులు, గంజాయి అక్రమ రవాణాపై నిఘా తదితరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీస్, సెబ్ సమన్వయంతో డ్రగ్స్ అమ్మకాలు, సేవించడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, గంజాయి రవాణాకు సంబందించి ఇతర జిల్లాల అధికారులతోనే కాక పక్క రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల అధికారులతో సమాచారం పంచుకుంటూ గంజాయి రవాణాను అరికట్టుటకు కృషి చేస్తున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

6న కాకినాడలో శాంతి సమాఖ్య సదస్సు

ప్రజాశక్తి-కాకినాడ

నవంబర్ 6న ఇంద్రపాలెం లాకుల వద్ద యుటిఎఫ్ మీటింగ్ హాలులో శాంతి సమాఖ్య సదస్సు నిర్వహిస్తున్నట్టు సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ పార్కులోని గాంధీ విగ్రహం వద్ద శాంతిసదస్సు పోస్టర్‌ను సమాఖ్య ప్రధాన ప్రతినిధులు ఆవిష్కరించారు. ఉగ్రవాదం, యుద్ధాల వల్ల మానవాళికి పెనుముప్పు వాటిల్లుతోందని సమాఖ్య పేర్కొంది. పాలస్తీనా జాతి నిర్మూలనకు జరుగుతున్న దాడులు మానవ ప్రగతికి అనర్థదాయకమన్నారు. పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధ పూర్వా పరాలపై ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ఈ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సమాచార హక్కు చట్టం జెఎసి అధ్యక్షుడు పప్పు దుర్గారమేష్, ఆర్‌పిఐ జాతీయ కార్యదర్శి పిట్టా వర ప్రసాద్, ట్రేడ్ యూనియన్ లీడర్ పెద్దింశెట్టి రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, గోపు చెల్లారావు, వి.రవికుమార్, ఇబ్రహీం, అయినాపురపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిఠాపురం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

పట్టణంలోని ఎంఆర్‌సి భవన్‌లో ఎంఇఒ నారాయణదాసు శుక్రవారం జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు-2023 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన కలిగినపుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జరిగే చెకుముకి సైన్స్ సంబరాల్లో పిఠాపురం మండలంలోని, అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రైవేట్ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరూ పాల్గొనేలా అన్ని యాజమాన్యాలూ కృషి చేయాలని కోరారు. చెకుముకి సైన్స్ సంబరాలు 33 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ టాలెంట్ పరీక్ష నవంబర్ 10న పాఠశాల స్థాయిలో, నవంబర్ 30న మండల స్థాయిలో, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెకుముకి కన్వీనర్ నేమిశెట్టి గంగబాబు, జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం మూర్తి, విరవ జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు అత్యవసర కార్యాచరణ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మెట్ట ప్రాంత మండలాల్లో కీలక దశలో ఉన్న పంటలను కాపాడేందుకు అత్యవసర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టు హాల్లో వ్యవసాయ, రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంట సజావుగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. తుని, ప్రత్తిపాడు, తొండంగి, జగ్గంపేట, కోటనందూరు మండలాల్లో కాలువల కింద, వర్షాధారంగాను రైతులు సాగు చేసిన పంటలు సాగు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న దష్ట్యా రెవెన్యూ, వ్యవసాయ, సాగునీటి శాఖల అధికారులు ఈ మండలాల్లో పర్యటించి పరిస్థితులను చక్కదిద్దేందుకు అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శివారు భూములకు కూడా తగినంత నీరు చేరేలా ఎగువ ప్రాంతాల్లో నీటి సరఫరాను ప్రణాళికా బద్ధంగా నియంత్రించాలని సూచించారు. పుష్కర కాలువపై ఆక్రమణలను, అవరోధాలను తొలగించాలని, మోటార్లుతో అక్రమంగా నీటి వాడకాన్ని తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, ఎస్ఇ ఇరిగేషన్ జి.శ్రీనివాసరావు, పుష్కర ఎస్ఇ కె.ఏసుబాబు, ఆర్ అండ్ బి ఎస్ఇ హరిప్రసాద్ బాబు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలుచోట్ల వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ విద్యార్థులకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, బి.సత్యనారాయణ, ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు పి.మురళీకృష్ణారెడ్డి, ఎస్.రాంబాబు, జయరాం ప్రసాద్ పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాస రచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యా సంస్థల ఎఒ సిహెచ్ఆర్.సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపల్ ఎం.సురేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.నాగబాబు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నరేష్ పాల్గొన్నారు. **గండేపల్లి** పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ వై.గణేష్ కుమార్, ఎఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు. **కరప** పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్‌లో ఎస్ఐ నౌడు రామకృష్ణ, ఎఎస్ఐ ప్రసన్నకుమార్, ఎఎస్ఐ సూరిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **తుని** పట్టణ సిఐ ఎం.గీతా రామకృష్ణ జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికలకు స్టేషన్‌లో అవగాహన కల్పించారు.



గండేపల్లిలో..



సామర్లకోటలో..

అధికారమే లక్ష్యంగా టిడిపి శ్రేణుల కృషి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా టిడిపి శ్రేణులు కృషి చేయాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పిలుపు నిచ్చారు. పనసపాడులో బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమంపై శుక్రవారం విస్తత స్థాయి సమావేశంలో ఎంఎల్‌ఎ చినరాజప్ప మాట్లాడారు. తమ అధినేత చంద్రబాబుకు బెయిల్ వచ్చే వరకూ తాను రాజమహేంద్రవరంలోనే ఉండి పర్యవేక్షిస్తానని, కార్యక్రమాలను నాయకులు కొనసాగించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో అడబాల కుమార స్వామి, తోటకూర శ్రీనివాసు, రాజా సూరిబాబు రాజు, పాలకుర్తి శ్రీనివాసా చార్యుల చౌదరి, కంటే జగదీష్‌మోహన్, కడియం ఎంపిపి ఎలుబండి ప్రసాద్, గుమ్మళ్ల రామకృష్ణ, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, బలుసు వాసు, రాయవరపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ ఉద్యోగాలు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రూ.8 లక్షల వార్షిక వేతనంతో మంచి ఉద్యోగాలు సాధించి సత్తా చాటారని వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీశ్ రెడ్డి తెలిపారు. ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ థాట్వర్క్స్‌లో కొలువులు సాధించి డిప్లొమా స్థాయిలోనే అత్యుత్తమ ప్యాకేజ్ పొందారని ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్.కుమార్ తెలిపారు. విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ కుమార్, డీన్ ఎ.వి.మాధవరావు అభినందించారు.

రిపబ్లిక్ డే క్యాంపునకు ఆదిత్య విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ దాసరి నిస్సి ప్రియాంక ప్రి రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు ఎంపికైనట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. 2018 నుంచి 6వ సారి ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు తెలిపారు. సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాస నిర్మాణం అనే ఉద్దేశంతో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన రిపబ్లిక్ డే పెరేడ్ సెలక్షన్స్‌లో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ స్థానం సాధించింది.

తాటిపర్తిలో జనసేన జన బాట

ప్రజాశక్తి - పెద్దాపురం

తాటిపర్తి గ్రామంలో శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి తుమ్మల రామస్వామి (బాబు) 'జనసేన జనబాట'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పులిమేరు బుల్లబ్బాయి స్వామి, బిక్కిన రాజశేఖర్, సరోజ్ వాసు, మలిరెడ్డి బుచ్చిరాజు, కొప్పిరెడ్డి నాగబాబు, ఒబిలిశెట్టి గణేష్, కొమ్మిరెడ్డి బాబ్జి, ద్వారంపూడి చల్లారావు, గోపు సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

పలుచోట్ల శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటయ్యపాలెంలో నిర్వహించిన శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, పంచాయతీ కార్యదర్శి పి.రామరాజు పాల్గొన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ నళిని మహిళలకు, ప్రజాప్రతినిధులకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ఎంపిపి కొపనాతి లలిత, నాగరాజు, బర్రే కాటవేణి, మల్లాడి శ్రీనివాస్, వైదాడి శ్రీనివాస్, సంగాడి శ్రీనివాస్, పాలెపు పోసియ్య, కామాడి భైరవమూర్తి పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్, కిర్లంపూడి** ప్రజలందరికీ వైద్య సదుపాయాలు అందజేస్తామని ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండలంలోని ఇర్రిపాక, కిర్లంపూడి మండలం పాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కిర్లంపూడి ఎంపిపి తోట రవి, అయా గ్రామాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లరేవులో సేవలను వివరిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ నళిని

పంట నమోదు జాబితా సిద్ధం

ప్రజాశక్తి-ఏలేశ్వరం, రౌతులపూడి

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్టు మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి తెలిపారు. మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో 2023 ఖరీఫ్ పంట నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్టు చెప్పారు. రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పంట నమోదు పరిశీలించుకోవాలని ఆమె కోరారు. పంట నమోదులో ఏమైనా లోపాలు, తేడాలు ఉంటే వెంటనే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని ఆమె కోరారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రౌతులపూడి మండలంలోని ఆయా గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్టు వ్యవసాయ అధికారి ఆర్.ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో 2023 ఖరీఫ్ పంట నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్టు చెప్పారు. గ్రామాల్లోని రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పంట నమోదు పరిశీలించుకోవాలని కోరారు.

గణపతి ఆలయంలో డిసిసిబి ఛైర్మన్ వీర్రాజు పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాల పట్నంలోని గణపతి ఆలయంలో శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ ఆకుల వీర్రాజు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బి.పట్నం పిఎసిఎస్ ఛైర్మన్ నల్లల నాగేంద్రబాబు, రాయభూపాలపట్నం సర్పంచ్ చీకట్ల లక్ష్మి, మార్ని వెంకన్న, గుణ్ణం వీరభద్రరావు, ఉప్పలపాటి వీరభద్రరావు, చీకట్ల సత్తిబాబు, ఉండవల్లి సూర్యనారాయణ, బొడ్డు శ్రీను, చంద్ర రాంబాబు, అట్టా వెంకన్న, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నువ్వు చూసే ఆ సీరియల్.. ఈ కేసూ ఇప్పట్లో అవ్వేవి కావుగానీ వచ్చి కొంచెం వడ్డిస్తావా..!!



ఎస్‌పికి స్వాగతం పలుకుతున్న యాజమాన్యం

ఆరోగ్యకరమైన అందం అవసరం

ప్రజాశక్తి కాకినాడ

ఆరోగ్యకరమైన రక్షణతో కూడిన అందాల సలహాలు ఇవ్వాలని ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ అన్నారు. ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ నల్లమిల్లి మాధురిచే స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన మాధురి స్కిన్, హెయిర్ అండ్ లేజర్ క్లినిక్‌ను ఎస్‌పి శుక్రవారం ప్రారంభించారు. మారుతున్న యువత సరికొత్త ఆలోచనలకు అనుగుణంగా కాస్మటాలజీ లేజర్ క్లినిక్‌ను కాకినాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ మాధురిని అభినందించారు ఈ కార్యక్రమంలో ఎన్.ప్రతాపరెడ్డి, యు.మురళీకృష్ణ, డాక్టర్ శుభశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'గోరుముద్ద'లో నాణ్యత లేని గుడ్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు అందజేసే కోడిగుడ్లలో నాణ్యత మచ్చుకు కూడా కానరావడం లేదని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. శుక్రవారం సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో గుడ్ల నాణ్యతను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం యు.మీనా మాధురికి ఫిర్యాదు చేశారు. అనంతరం అప్పలకొండ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఒక ఏజెన్సీ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని సరఫరా చేస్తున్నారని, ఆ ఏజెన్సీ యాజమాన్యం విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వహిస్తూ నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేస్తోందన్నారు. కొందరు విద్యార్థులైతే మధ్యాహ్న భోజనంలో అందజేస్తున్న కోడిగుడ్డు తీసుకోవడానికి కూడా ఆసక్తి చూపడటం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చున్నారు. ఆ ఏజెన్సీపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల సంఘం నాయకుడు కుంచే నానిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి - మండపేట

లారీ ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన మండపేట సత్యశ్రీ రోడ్డులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...స్థానిక సంఘం కాలనీలో నివాసం ఉంటున్న కోనే శ్రీను మంగ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు మహేష్ (13) స్థానిక సత్య శ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వివి మున్సిపల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి స్కూలుకు వెళతుండగా సత్య శ్రీ రోడ్డులోని కోళ్ల ఫారం ఎదురుగా దుప్పలపూడి నుంచి మండపేట వస్తున్న లారీ వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై పట్టణ ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో టెక్నీషియన్ మరణం

ప్రజాశక్తి - రాజోలు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో టెక్నీషియన్ పనిచేస్తున్న ఈదా ఎజ్రా శాస్త్రి (30) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...మలికిపురం మండలం రామరాజులంక చిన పేటకు చెందిన ఎజ్రా శాస్త్రి రాజోలు ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక కోళ్ల వారి వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రామరాజు లంకలోని తన సొంత ఇంటికి వెళ్లి గురువారం రాత్రి సమయంలో రాజోలు తిరిగి వస్తుండగా రాజోలు లూథరన్ చర్చి సమీపంలో మోటర్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు మీద పాతి పెట్టిన బండరాయిని ఢీ కొట్టి పక్కన ఉన్న మురుగు కాల్వలో పడి మృతి చెందాడు. మృతినికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు మృతుని బావ మేడిద నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పలువురు నివాళి

ఏరియా ఆసుపత్రి వద్ద మార్చురీలో ఉన్న ఎజ్రా శాస్త్రి మృతదేహాన్ని ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు సందర్శించి నివాళులు అర్పించారు. పోస్టు మార్టం అయ్యేంతవరకు ఆసుపత్రి వద్ద ఉండి మృత దేహాన్ని అంబులెన్స్‌లో ఆయన స్వగ్రామానికి తరలించారు. చిన్న వయస్సులోనే ఎజ్రా శాస్త్రి మృతి చెందడం బాధాకరమని అన్నారు. రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, ఏరియా ఆసుపత్రి సూపర్‌టెండెంట్ డాక్టర్ అప్పారి సూర్య నారాయణ, వైద్యులు సృజన, వేణు, అజీమ్, ప్రియాంక, ప్రశాంతి, ఐసిటిసి కౌన్సిలర్ ప్రతాప్ ఆసుపత్రి సిబ్బంది శాస్త్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

యువతి అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన యువతి అదే గ్రామంలో ఇంటర్మీడియట్ చదువుతుంది. ఈనెల 26న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్ళింది. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు, బంధువులు ఇంటి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్రేయపురం ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

దాడి చేసిన సంఘటనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇరుకు రోడ్డులో ఆటోను ఎందుకు స్పీడుగా డ్రైవ్ చేస్తున్నావు అని అడిగిన వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన జవ్వాది వరుణ్ అక్షయ్ గురువారం మెర్లవీధిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఆదే గ్రామానికి చెందిన రాచూరి రామకృష్ణ ఆటోను వేగంగా డ్రైవ్ చేస్తూ అక్షయ్‌ని ఢీకొట్టాడు. దీంతో ఇరుకు రోడ్డులో అంత స్పీడు ఎందుకని ప్రశ్నించిన అక్షయ్‌పై రామకృష్ణతోపాటు, అతని కుమారులు దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు అక్షయ్ ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివై.కిరణ్‌కుమార్ తెలిపారు.

టిడిపి నేతలపై వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సిఎం జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం, సిఎం చిత్రపటంపై మద్యాన్ని పోసిన టిడిపి నాయకులపై వైసిపి నాయకులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అర్బన్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నగరంలోని 1, 2, 3 పోలీసు స్టేషన్లలో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు.

జగన్ ఎందుకు కావాలంటే...

ప్రజాశక్తి - పెరవలి

రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. స్థానిక దీపికా ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ సదస్సులో ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌దేనని అన్నారు. ఇచ్చిన మాటను తప్పని జగన్‌ను మరోసారి సిఎంను చేసుకోవాలని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, జడ్‌పిటిసి కె.రామాంజాని, వి.సత్యనారాయణ, పి.భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి -కొత్తపేట

దేవి నవరాత్రులను పురస్కరించుకుని చిన్నారులచే డి.వెంకట్రాయ నాట్య బందం శిష్యులు కూచిపూడి ప్రదర్శన అందరినీ అలరించింది. మండల పరిధిలోని బిళ్ళకుర్రు శివారు డేగల వారి పాలెం గ్రామంలో దేవి నవరాత్రులను పురస్కరించుకుని కళాకారులు కోలా రాము గురు ఆధ్వర్యంలో డేగల వారి పాలెం, వాకాడ వారి పాలెం, కొత్తపేట గ్రామాలకు చెందిన 50 మంది చిన్నారులచే క్లాసికల్ కూచిపూడి నాట్య ప్రదర్శనను నిర్వహించారు అనంతరం గురువు రామును గ్రామ పెద్దలు సత్కరించారు. చిన్నారులకు మెమెంటోలను కమిటీ వారు అందజేశారు. భారీ అన్న సమాధాన, ఉదయం నుండి భారీ అన్న సమాధాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

సాన సతీష్ బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా స్థానిక మహారాణి కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన టీములు జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. ఈ పోటీలకు మండల పరిధిలో 15 టీములు వచ్చాయన్నారు. విన్నర్స్ జట్టుకు జ్ఞాపకలతో పాటు రూ.8 వేల నగదు, రన్నర్స్ జట్టుకు జ్ఞాపకలతో పాటు రూ.5 వేలు నగదు బహుమతులు ఉంటాయన్నారు. పతి టీముకూ రూ.వెయ్యి నగదు అందజేస్తామన్నారు.

3న ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

నవంబర్ 3న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య కోరారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)కు అనుగుణంగా సీస్ పరీక్ష రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఎంఇఒలు మాట్లాడుతూ 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నవంబర్ 3న పబ్లిక్ పరీక్షల మాదిరి నిర్వహిస్తారని తెలిపారు. గణితం, లాంగ్వేజ్‌లో 60 మార్కులకు ఒఎఆర్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి, జాతీయ స్థాయిలో మన ర్యాంక్ తెలుసుకోవడంతో పాటు ఉన్నత ప్రమణాల సాధనకు ప్రణాళిక రూపొందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కూర్మారావు,హెచ్ఎంలు ఎల్.గోవిందరాజు, యు.సత్యనారాయణ, ప్రసూన, కుసుమ, మీనా మాధురి, పాండవులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సిఎం వైఎస్.జగన్ అధికారంచేపట్టిన నాటి నుంచి నేటి వరకూ అందుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ వాలంటీర్‌లు, గృహసారథులు ఇంటింటికుఈ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యార్లగడ్డ సూర్యారావు రైతు భవన్‌లో మండల పరిధిలో గ్రామ వాలంటీర్ల, గృహసారథులకు మళ్లీ ఎపికి జగనే సిఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రాధాన్యతను మళ్లీ ఎందుకు అధికారంలోకి రావాలో ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపిలు ములసా శ్రీను, పేర్నిడి వెంకటరాయుడు, తాటికొండ అచ్చిరాజు, ఎలిశెట్టి నరేష్, మలకల వరాలబాబు, కొప్పిరెడ్డి రాధాకృష్ణ, తలారి దొరబాబు, గ్రామ వలంటీర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 4వ వార్డులో మంచి నీటి పైపులైన్ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి 18వ వార్డులో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సిమ్మ సూర్యావతి, నీలంశెట్టి అమ్మాజీ, విడదాసరి రాజా, ఆరెళ్ల వీర రాఘవ, కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు సిమ్మ అంజి, నీలంశెట్టి పండు, మున్సిపల్ ఎఇ జీవన్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎను నిలదీస్తున్న మత్స్యకార మహిళలు

ఇళ్ల స్థలాల కోసం ఎంఎల్ఎ నిలదీత

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబును మత్స్యకార మహిళలు చుట్టుముట్టి నిలదీశారు. మూలపేటలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక సర్పంచ్ మౌనిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంఎల్ఎ దొరబాబును వాడ బలిజిపేటలో మత్స్యకార మహిళలు ఇళ్ల స్థలాల కోసం నిలదీశారు. దీంతో స్థానిక సచివాలయ సిబ్బందిని పిలిచి ఇళ్ల స్థలాలు రానివారి పేర్లను తక్షణమే నమోదు చేయాలని ఎంఎల్ఎ ఆదేశించారు.

తాగునీటి కాలుష్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -కరప

వేళంగి గ్రామంలో రక్షిత తాగునీరు ప్రాజెక్టు నుంచి మురుగునీరు సరఫరా అవుతోందని గ్రామ కార్యదర్శులకు గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో మంచినీరుకి బదులు మురికి నీరు సరఫరా అవుతోందని ఈ మురికి నీరు తాగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు టైపాయిడ్ జ్వరంతో హాస్పటల్‌లో వైద్యం పొందుతున్నారని చెప్పారు. వేళంగి వైసిపి నాయకుడు పిల్లి వీరబాబు కుటుంబంలో ఆరుగురు టైపాయిడ్ జ్వరంతో అనారోగ్యానికి గురైనట్టు తెలిపారు. విష జ్వరాల పట్ల అవగాహన కల్పించడంలో అధికారులు, వైద్య సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారని చెప్పారు. దీనిపై సెక్రటరీ స్పందిస్తూ సమస్యపై సంబంధిత అధికారులకు తెలియపరుస్తామని తెలిపారు.



పంట చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పంట ప్రయోగాల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిఆర్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి ఆధ్వర్యంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం కట్టమూరు, గోరింట గ్రామాల్లోని పంట ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ భరత్ లక్ష్మి ఆధ్వర్యంలో అధిక పంట దిగుబడులు, చీడ పీడల నివారణ, మంచి వంగడాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక విధానాలు వంటి అంశాలపై రైతులతో చర్చా గోష్టి నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకట నరసింహారావు, డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, డాక్టర్ భరత లక్ష్మి తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

యానాం వార్తలు



చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - యానాం

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసే చెకుముకి సైన్స్ సంబరాలను నవంబర్ 10 నుంచి 2024 జనవరి 28 వరకు నాలుగు స్థాయిలో నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ఆనాల వీరభద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ఎఒ మునిస్వామిని కలిసి ఆయన చేతుల మీదుగా చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో చదువుకునే 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొనాలని కోరారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులను మునిస్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో కెవివి సత్యనారాయణ, టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి - యానాం

యానాం టౌన్ వాటర్ వర్క్సులో నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా శనివారం సాయంత్రం పూట తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మెట్టకూరు, గోపాల్ నగర్, అంబేద్కర్ నగర్, ఫ్రాన్స్ తిప్ప, కురసాంపేట ప్రాంత వినియోగదారులకు జరుగుతున్న అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

హోంగార్డ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి - యానాం

యానాం,పుదుచ్చేరి, మాహే, కారైకాల్ రీజియన్ పరిధిలోని పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న హోంగార్డు పోస్టులకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. యానాం-25, మహే-37, కరేకల్-68, పుదుచ్చేరి 290 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 30 నుంచి నవంబర్ 29వ తేదీల్లోగా అర్హులైన అభ్యర్థులు రిక్రూట్మెంట్. పివై. జి ఓ వి. ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా యానాంకు కేటాయించిన దానిలో ఒక మహిళ హోంగార్డుకు సైతం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజవర్గానికి సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఆర్ఎఒ మునిస్వామి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 9 లోగా డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాలను తెలుపవచ్చుని, దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. జనవరి 5న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, బిజెపి అధ్యక్షుడు కనకాల రాజు, డిఎంకె అధ్యక్షుడు భాషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, బిఎస్‌పి అధ్యక్షుడు దూళిపూడి మధు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



కలశ యాత్రలో పాల్గొన్న డాక్టర్ కె.కలెక్టర్ మాధవీలత

పర్యావరణాన్ని పరిరక్షిణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ కలశ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత పిల్లలు చిన్నప్పటి నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. మన దేశ సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించటానికి వివిధ ప్రాంతాల నుంచి మట్టిని, నీరును సేకరించే పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దేశ ప్రధాని పిలుపు మేరకు జిల్లాలోని 18 మండలాలు, మూడు పట్టణ ప్రాంతాల నుంచి మట్టి, నీరు, బియ్యం సేకరించి ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందజేయడం జరుగుతుందన్నారు. శనివారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలు ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చే అధికారుల నేతృత్వంలోని బృందాలు విజయవాడ చేరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 గ్రామ పంచాయతీల నుంచి ఆమేరకు సేకరణ చేపట్టి, ప్రతి మండలం నుంచి రెండేసి కలశాలు జిల్లా ప్రధాన కేంద్రానికి చేరుకున్నట్లు తెలిపారు. జిల్లా తరపున నోడల్ అధికారిగా డ్వామా ఎఇ జె.సూర్యనారాయణ ను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, .జెసి ఎన్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా) పి. జగదాంబ తదితరులు కలశ యాత్ర నిర్వహించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి-అయినవిల్లి



లబ్ధిదారులకు చెక్కులందిస్తున్న ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు

నల్లచెరువు, వీరవిల్లిపాలెం, నేదునూరు, వెలువలపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సిఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల6వేల చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట చార్యులు, వైస్ ఎంపిపి బాయ్యా చినబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బొంతు రాజేద్రప్రసాద్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, శనపల్లిలంక సొసైటీ అధ్యక్షులు మాట్టపర్తి రామారావు, మండల అధ్యక్షులు కుడుపూడి విద్యాసాగర్, నాయకులు లబ్దిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నేత చంటి మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి సీనియర్ నాయకుడు కిత్తన చెరువుకు చెందిన బళ్ల చంటి(57) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చంటి మృతి పట్ల మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, ఎంపిపి దంగేటి అచ్యుత జానకి, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, వైసిపి మండల అధ్యక్ష కార్యదర్శులు బద్రి బాబ్జి తదితరులు సంతాపం తెలిపారు.



బాధితులకు నిత్యావసరాలు, వంట సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కొమరగిరి గ్రామ పంచాయతీలో లైన్‌పేట గ్రామంలో అర్ధరాత్రి సమయంలో మాగాపు అప్పాయమ్మ కు సంబంధించి తాటాకిల్లు షార్ట్ సర్క్యూట్ కారణగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవటంతో ఆ ఇంటిలో ఉన్న సిమెంటు బస్తాలు, రూ. 5లక్షలు నగదు కాలి బూడిద అయ్యాయి. ఈ ఘటనపై సమాచారాన్ని సమీపంలో బంధు వులు శుక్రవారం పంచాయతీ అధికారులకు తెలిపారు. విషయం తెలుసుకొన్న రెడ్ క్రాస్ సొసైటీ వారు వంట సామగ్రి, 30కేజీలు బియ్యం, ఐజినిక్ కిట్, టార్పాలిన్, కూరగాయలు బాధితులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు, ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ వరసాల విజయచాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-మండపేట

గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ ప్రభుత్వాస్పత్రిలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్పందన, భావన, లావణ్య, సుధా తదితరులు పాల్గొన్నారు.

గంగుమళ్లకు మాజీ ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-అయినవిల్లి

ఇటీవల హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న అయినవిల్లి మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణను కె.జగన్నాధపురం గ్రామంలోని వారి స్వగృహంలో పి.గన్నవరం మాజీ ఎంఎల్ఎ పాములు రాజేశ్వరిదేవి శుక్రవారం పరామర్శించారు. అన్నపూర్ణ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2024 కు సంబంధించి శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులకు శుక్రవారం అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7,40,749 మంది పురుష లు, 7,48,023 మంది స్త్రీలు, 22 మంది ట్రాన్స్ జెండర్స్ వెరసి 14,88,794 మంది ఓటర్లుగా ఇ ప్పటి వరకు నమోదయ్యారని అన్నారు.

మరమ్మతు పనుల్లో నాణ్యత ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి విజ్జేశ్వరం వరకు జిల్లాకు చెందిన రహదారి పనుల కోసం కేటాయించిన రూ.25 లక్షల నిధులను నాణ్యతతో పనులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయాలని కలెక్టర్ కె. మాధవీలత ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ప్రతిపాదించిన రహదారుల పనులను ఇరిగేషన్, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ బ్యారేజ్ రహదారి ప్రాంతంలో రూ.25 లక్షల నిధులతో చేపడుతున్న పనుల పురోగతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. నాణ్యత విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలక్ష్యం వహించ వద్దని స్పష్టం చేశారు. ఆర్ సి ఆర్ బి (రోడ్ కం రైల్ బ్రిడ్జి) పనులను పూర్తి నాణ్యత కలిగిన ప్రామాణికం గా చేపట్టడం జరుగుతోందని అన్నారు. రహదారి పనుల్లో ప్యాచ్ వర్క్ ఇతర పనులు పూర్తి స్థాయి ప్రమాణాలకు తగినట్లుగా చేపట్టాలని అన్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని, నవంబర్ 9 న ఓపెన్ చేయనున్నట్లు కలెక్టర్ కి వివరించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ అధికారులు ఇఇ ఆర్.కాశీ విశ్వేశ్వర రావు, డిఇ యు.రమేష తదితరులు పాల్గొన్నారు.

జైల్లో 'జెఎఎస్' శిబిరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జెఎఎస్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారని జైలు సూపరింటెండెంట్ ఎస్ . రాహుల్ తెలిపారు. స్థానిక సెంట్రల్ జైల్‌లో శుక్రవారం జెఎఎస్ శిబిరంలో తొలిరోజు 572 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఖైదీలకు స్పెషలిస్ట్ డాక్టర్లు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, తదనుగుణంగా తదుపరి వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లా ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డా పి. ప్రియాంక మాట్లాడుతూ మొత్తం 9 విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ తొలి రోజు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఆ క్రమంలో కంటి సంబంధ సమస్యలతో పాటు, హృద్రోహ, జనరల్ మెడికల్, అర్థోపెడిక్, తదితర సేవలు అందించినట్లు తెలిపారు. ఉచితంగా కంటి అద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక మహిళా కారాగారంలో ఈనెల 30న మహిళా కారాగారంలో జెఎఎస్ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్ల తో పాటు గైనిక్ డాక్టర్లు కూడా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.